బడులకు నిధులొచ్చాయ్
- స్కూల్ గ్రాంటు, ఎంఆర్‌సీ, స్నాక్స్ నిధులు విడుదల

శ్రీవైకుంఠపురంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
10లో



విలేకరులతో మాట్లాడుతున్న సంగారెడ్డి ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు
సర్వం సిద్ధం
3 నుంచి 22 వరకు పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. రేపటి నుంచి 22 వరకు పరీక్షలు జరగనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకండ్ సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు కలిపి 86 కేంద్రాల్లో సుమారు 8 వేల మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరా నిఘాలో ప్రాక్టికల్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ సీసీ కెమెరాను ఇంటర్ బోర్డులోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశామని, ఉన్నతాధికారులు అక్కడి నుంచే పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు బోర్డు ఆదేశాలు పక్కాగా పాటిస్తూ ప్రాక్టికల్స్ నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

57 మంది బాల కార్మికులకు
విముక్తి
సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 57 మంది బాలలకు విముక్తి కల్పించినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ వివరించారు. శనివారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివిధచోట్ల పనిచేస్తున్న 50 మంది బాలలకు, 7మంది బాలికలకు విముక్తి కల్పించినట్లు తెలిపారు. 20 మంది యజమానులపై కేసులను నమోదు చేశామని తెలిపారు. బాలకార్మికులు కనిపించినా, ఎక్కడైనా పని చేస్తున్నట్లు సమాచారం ఉన్నా 1098, 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ఈసారీ నిరాశే!

మెదక్/సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025 కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌కమ్‌ట్యాక్స్ పరిమితిని పెంచడంపై వేతన జీవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్షికాదాయం స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని మొత్తం రూ.12.75 లక్షల వరకు పన్ను కట్టాల్సిన అవసరం లేకపోవటం సామాన్యులకు ఊరట కలిగించే అంశం. అయితే, జిల్లాలకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపు లేకపోవడం నిరాశ కలిగించింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని రైల్వే లైన్లకు నిధులు కేటాయించలేదు. ఎలాంటి కొత్త పనులనూ ప్రకటించలేదు. కొత్తగా ఏర్పడిన మెదక్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తారని ఆశించినా ఎలాంటి హామీ ఇవ్వలేదు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ పరిశ్రమలతో పాటు ఐఐటీ హైదరాబాద్‌కు నిధుల కేటాయింపులు లేకపోవడంపై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. అయితే, ఐఐటీల్లో సీట్ల సంఖ్యను పెంచుతున్నట్లు ప్రకటించడం ఊరటనిచ్చింది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో సీట్ల పెంపు ద్వారా జిల్లాలోని కంది వద్ద గల ఐఐటీ హైదరాబాద్‌లో కూడా విద్యార్థులకు సీట్ల సంఖ్య పెరగనున్నది. జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధి కోసం నిధుల ఊసెత్తకపోవడం ప్రజలను అసంతృప్తికి గురిచేసింది. సంగారెడ్డి జిల్లా మీదుగా కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్లే 65, 161వ నంబరు జాతీయ రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అదనంగా నిధులు కేటాయించకపోవడం పట్ల ఆయా రాజకీయ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల నవోదయ పాఠశాలను జిల్లాకు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, నిధులకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడం నిరాశకు గురి చేసింది.

రైల్వే లైన్లపైనా స్పష్టత కరువు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రైల్వే అభివృద్ధి పనులపైనా బడ్జెట్‌లో స్పష్టత లేదు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం ఈదుల నాగులపల్లిలో కొనసాగుతున్న రైల్వే వంతెన పనులు పూర్తి చేయడానికి భూసేకరణకు అవసరమైన నిధుల ఊసే లేదు. జహీరాబాద్-తాండూరు మధ్య కొత్త రైల్వే లైన్ మంజూరైనప్పటికీ, వికారాబాద్-పర్లీ వరకు డబుల్ లైన్ కోసం భూసేకరణ చేయాల్సి ఉన్నది. హైదరాబాద్-బీదర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్‌ను ప్రతీ రోజు నడిపించాలని, ఔరంగాబాద్-తిరుపతి వెళ్లే రైల్‌ను జహీరాబాద్ మీదుగా ప్రతీ రోజు నడిపించాలని ఏళ్ల తరబడి ఉన్న ప్రజల కోరికను నిర్మలసీతారామన్ విస్మరించారు. రామచంద్రాపురం మండలం వట్టి నాగులపల్లి నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా మెదక్ రైల్వే లైన్ కోసం గత ఏడాది సర్వే జరిగినప్పటికీ ఈ లైన్‌కు నిధులు కేటాయించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.



మెడికల్ కాలేజీలో సీట్ల పెంపుపై ఆశలు

వచ్చే ఐదేళ్లలో వైద్య కళాశాలల్లో సీట్లు పెంచనున్నామని బడ్జెట్‌లో వెల్లడించారు. మెదక్ మెడికల్ కాలేజీని తొలి సంవత్సరం 50 సీట్లతో కళాశాలను ప్రారంభించారు. రానున్న రోజుల్లో మెడికల్ సీట్లు పెరిగితే విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధనకు ఏర్పాట్లు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం శుభసూచకం. విద్యారంగంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ వినియోగం కల్పించనున్నట్లు ప్రకటించడంపై విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ పరిశోధనాశాలలు ఏర్పాటు చేస్తామని, అంగన్‌వాడీ పాఠశాలలకు కొత్త హంగులు కల్పిస్తామని కేంద్రమంత్రి తెలిపారు. పన్ను మినహాయింపుతో మెదక్ జిల్లాలో 8వేల మంది ప్రభుత్వోద్యోగులతో పాటు ప్రైవేటు ఉద్యోగులకు మేలు కలగనుంది.

- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంచడంతో వేతన జీవులకు ఊరట
- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య
- జిల్లా కేంద్రాలలో కేన్సర్ చికిత్స
- వైద్య కళాశాలల్లో పెరగనున్న సీట్లు
- జిల్లాల్లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు మొండి చేయి
- ఓడీఎఫ్, బీహెచ్‌ఎల్, బీడీఎల్‌లకు దక్కని నిధులు
- ఐఐటీలో సీట్ల పెంపుతో విద్యార్థులకు మేలు



పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారికి నిరాశ



పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ ఉద్యోగులకు ఊరటనిచ్చినప్పటికీ ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగులకు ప్రస్తుత ఆదాయ పన్ను మినహాయింపు నష్టదాయకంగా మారవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నివర్గాల ఉద్యోగులు ప్రతీ ఏటా బడ్జెట్‌లో ఆదాయ పరిమితి పెంపు జరుగుతుందని ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపునివ్వడం కొంతమేర ఊరట నిచ్చింది. హౌజింగ్ లోన్, ఇంటి అద్దె, బీమా, పొదుపుకు సంబంధించి ఇదివరకు ఉన్న పాత విధానంలో చేర్చి ఉంటే ఉద్యోగులకు ప్రయోజన కరంగా ఉండేదని భావిస్తున్నాం.

-దొంత నరేందర్, టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు

మధ్యతరగతికి ఉపశమనం



కేంద్రబడ్జెట్‌లో ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్ను పరిమితి పెంచి వేతన జీవులకు, ఆదాయపు పన్ను చెల్లించే మధ్యతరగతి వారికి మేలు జరిగింది. గత సంవత్సరం రూ.6.50 లక్షల వరకూ పన్నుపై రాయితీ ఇచ్చిన ప్రభుత్వం, కొత్త పన్ను విధానంలో రూ.12లక్షల వరకు రిబేట్‌ను పెంచారు. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ ఖాతాలపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను పరిమితి రూ. లక్షకు పెంచారు. మొత్తం మీద మధ్య తరగతివారికి ఆమోదయోగ్యంగా ఉంది.

-సిద్ధిరాములు టాక్స్ అడ్వకేట్, మెదక్

చిన్న పరిశ్రమలకు ఊరట



కేంద్రం ప్రకటించిన పన్ను టారిఫ్ ఆర్థికవృద్ధిలో గేమ్‌చేంజర్‌గా భావించ వచ్చు. దేశంలో కోటి మంది రిజిస్టర్ చేసుకున్న ఎంఎస్‌ఈఎస్‌ల ఆర్థిక ప్రగతికి ఇది దోహదపడుతున్నారు. పారిశ్రామిక ఉత్పత్తుల్లో 37 శాతం వాటా ఉన్న చిన్న, సూక్ష్మపరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది.

-గోకుల్ శ్రీధర్, ఖేల్ అన్సలరీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు, పటాన్‌చెరు

పన్నుపై మినహాయింపు హర్షణీయం



సంగారెడ్డి అర్బన్ : ఆదాయపు పన్ను మినహాయింపు పెంచడం మంచి నిర్ణయం. గిగ్‌వర్కర్ల కోసం గుర్తింపు కార్డులు, కోటి మంది ఆరోగ్య బీమా అందించడం హర్షణీయం. దేశంలో 50 కోట్లకు పైగా ఉన్న అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

-మోహన్‌రెడ్డి, బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

కార్పొరేట్లకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్
సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు మేలు చేసేలా ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శనివారం సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రైవేటీకరణను పెంచేలా ఉందని విమర్శించారు. కార్మికులు, రైతులకు, వ్యవసాయ రంగానికి ఉపయోగపడేలా లేదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే ప్రతిపాదనలు చేయలేదని, కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు.



సంగారెడ్డిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ఊతం



పటాన్‌చెరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమిక వర్గాలలో హర్షం వ్యక్తం అవుతోంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు (మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్, ఎంఎస్‌ఈఎస్)ల రుణపరిమితిని రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వంలో బడ్జెట్‌లో ప్రకటించారు. చిన్న పరిశ్రమలు ఆటుపోట్ల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో రుణపరిమితిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో ఊరట లభించింది. ఆదాయపన్ను టారీఫ్ పెంచడంతో పారిశ్రామికవాడలోని కార్మికులు, చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గంలోని పారిశ్రామికవాడల్లో పనిచేసే సుమారు 25వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది.



అన్నివర్గాలకు నిరాశ..

సంగారెడ్డి అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో సంగారెడ్డి జిల్లాకు మొండి చేయి చూపించారు. ఓడీఎఫ్, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ పరిశ్రమలకు ఒక్క పైసా కేటాయించలేదు. జిల్లాలో రైల్వే లైన్ ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలను నిరాశపర్చింది.

- నిర్మలాజగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు



సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వని కేంద్ర బడ్జెట్

సంగారెడ్డి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వలేదు. కేంద్ర బడ్జెట్ తెలంగాణపై వివక్ష చూపుతున్నది. కేంద్ర బడ్జెట్ తూర్పు రాష్ట్రాలకు వెళ్లిందని దక్షిణాది రాష్ట్రాల వైపు బడ్జెట్ ప్రభావం కనిపించలేదు. తెలంగాణకు ప్రాజెక్టునూ ఇవ్వలేదు.

-చింతాప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే



అన్ని వర్గాలకు అనుకూల బడ్జెట్

సంగారెడ్డి అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి, యువత, రైతు, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారు. పన్ను మినహాయింపు చారిత్రాత్మక నిర్ణయం. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరం. ప్రధాని, ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు.

-గోదావరి అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు

ఆత్మనిర్భర్ భారత్‌కు
స్వదేశీ సాంకేతికత అవసరం
నిర్మాణ రూపకల్పనలో ఫీస్ట్ సాఫ్ట్‌వేర్ కీలకం: ఇస్రో చైర్మన్ వి.నారాయణన్



ఐఐటీహెచ్ సదస్సులో వీడియోకాన్ఫరెన్ ద్వారా ప్రసంగిస్తున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్

కంది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భార్ భారత్ అభివృద్ధికి స్వదేశీ స్టాఫ్‌వేర్లు అవసరమని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో శనివారం 8వ జాతీయ పరిమిత మూలకం అభివృద్ధిలో భాగంగా ఇస్రోలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఫీస్ట్ సాఫ్ట్‌వేర్ కొత్త వెర్షన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ఉన్నికృష్ణన్ నాయర్‌తో పాటు దేశనలుమూల నుంచి ఐఐటీలు, ఐఐఎస్‌సీ, ఐఐఎస్‌టీలు, ప్రముఖ ఇంజనీరింగ్ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్‌లో వీడియోకాన్ఫరెన్ ద్వారా ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రసంగించారు. న్యూమరికల్ సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్‌లో డైనమిక్స్ సాఫ్ట్‌వేర్ ఫీస్ట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. భారత అంతరిక్ష పరిశోధనలో రాబోవు రోజుల్లో మరిన్ని అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయని ఆకాంక్షించారు. రోబోటిక్స్, కృత్రిమమేధ సహకారంతో అంతరిక్ష పరిశోధనలు మరింత బలపడతాయన్నారు. ఏరోస్పేస్ స్ట్రక్చరల్ చాలెంజింగ్‌లో పరిమిత మూలకం ఆధారిత నిర్మాణ విశ్లేషణ రంగంలో ఫీస్ట్ సాఫ్ట్‌వేర్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. అనంతరం ఫీస్ట్ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించి డిజైన్, క్విజ్ పోటీలు జరిగాయి. విజ్ఞాన మార్పిడి కోసం ఇస్రోతో కలిసి ప్రాజెక్టులు చేయడం గర్వకారణమని, దేశ అభివృద్ధిలో ఐఐటీహెచ్ పరిశోధకులు భాగస్వాములవుతారని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి తెలిపారు.

అమ్మకానికి అసైన్డ్ భూములు

- లేఅవుట్ చేసి దర్జాగా రిజిస్ట్రేషన్లు
- అక్రమార్కులకు అధికారుల అండ!
- ముత్తంగి కేంద్రంగా జోరుగా దందా
- ఇప్పటికే మాయమైన 50 ఎకరాలు

రామచంద్రాపురం టౌన్ : ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు వ్యవసాయం చేసుకొని జీవనం సాగించడానికి కేటాయించిన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్‌భూములు చేతులు మారుతున్నాయి. ఇప్పటికే 50 ఎకరాలు మాయం కాగా, మరో 11 ఎకరాలను ప్లాట్లు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ముత్తంగి గ్రామం ఔటర్‌రింగ్‌రోడ్డు జంక్షన్‌కు ఆనుకొని ఉన్న స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. పట్టా భూములు రూ.10 కోట్లు పలుకుతుండగా.. అసైన్డ్ భూములు రూ. 40 లక్షల నుంచి రూ. కోటి వరకు కొనుగోలు చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కై వెంచర్లు చేసి గజం రూ. 30 వేలకు పైగా విక్రయిస్తున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడ నుంచి ఇస్నాపూర్, ముత్తంగి గ్రామాల మీదుగా కర్ధనూరు వరకు వేసిన 100 అడుగుల రోడ్డుకు ఆనుకొని ఉన్న భూములకు సైతం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇక్కడ ఇప్పటికే 5 లేఅవుట్‌లు వేసి అసైన్డ్ భూములు విక్రయిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు

అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకోవాల్సిన అధికారులే రిజిస్ట్రేషన్‌లు చేసి హక్కులు కల్పించడం చర్చనీయాంశంగా మారింది. ముత్తంగి గ్రామంలో 214 ఎకరాల ప్రభుత్వ భూమిని 315 మంది గ్రామస్థులకు అసైన్డ్ చేశారు. సదరు భూములను రైతులు సాగు చేయకుండా అమ్ముకుంటున్నారు. ఔటర్ రింగురోడ్డు, జాతీయ రహదారి, పారిశ్రామికవాడలకు ఆనుకొని ఉన్న భూములను ప్లాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. 50 ఎకరాల అసైన్డ్ భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయి.

నిషేధిత జాబితా నుంచి తొలగింపు

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు జరగకుండా ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చారు. కానీ, అధికారులు తమకు కావాల్సిన వారు కొనుగోలు చేసిన భూములను నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నారు. కొద్దిరోజులు వేచిచూసి ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే వ్యవసాయ పట్టా భూమిగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అనంతరం నాలా మార్పిడీ చేసి ఇళ్ల స్థలాలుగా మార్చి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.



అసైన్డ్ భూమిలో నిర్మించిన రహదారి

అసైన్డ్ భూములపై అప్రమత్తంగా ఉన్నాం

అసైన్డ్ భూముల విషయంలో అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించి సాధారణ భూములుగా మార్చే అధికారాలు మాకు లేవు. నేను విధుల్లో చేరకముందు జరిగిన విషయాల గురించి తెలియదు.

- కార్తీక్, ఉప తహసీల్దార్, పటాన్‌చెరు

ప్రత్యక్షంగా పరిశీలించిన తరువాతే అనుమతులు

మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో నిర్మాణాల అనుమతు మంజూరు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూముల్లో వెంచర్లు చేసి, పట్టా భూముల సర్వే నంబర్లు వేసి అనుమతులు తీసుకుంటున్నారని తెలిసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రత్యక్షంగా పరిశీలించిన తరువాతే అనుమతులు ఇస్తున్నాం.

- సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్



రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వివిధ విభాగాల్లో పతకాలు కైవసం క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

స్పోర్ట్స్ మీట్ విజేతలకు ఎస్పీ అభినందన

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్ అభినందించారు. జిల్లా పోలీసులు ఎనిమిది పతకాలు సాధించిన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి పోలీసు శాఖకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కంది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. రామచంద్రపురం మండలం వెలివెల గ్రామానికి చెందిన అంశంగారి రాజు(37) కొన్నేళ్లుగా భార్యకు దూరంగా ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కలివేముల శివారులో ఒంటిపై అక్కడక్కడ దెబ్బలతో చనిపోయి పడి ఉన్నాడు. గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. మృతదేహం వద్ద తాగి పడేసిన మద్యం, మంచినీళ్ల బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు పోలీసులకు లభించాయి. పోలీసులు వెంటనే రాజు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుని ఎక్కడైనా హత్య చేసి కలివేముల శివారులో పడేశారా? లేక ఇక్కడే మద్యం తాగి అతను చనిపోయాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

భర్త వేధింపులతోనే ఆత్మహత్య

రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 28న అనుమానాస్పద స్థితిలో మరణించిన మహిళ.. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. సర్వేయరీ కత్తూర్(20) మృతిచెంది ఉండగా, నాడు పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టగా, భర్త జహంగీర్ వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు తేల్చారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దుబ్బాక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఉరివేసుకున్న ఘటన శనివారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధి ధర్మాజీపేట వార్డులో చోటుచేసుకుంది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ కథనం ప్రకారం.. ధర్మాజీపేట వార్డుకు చెందిన లక్ష్మన్(49)కు చౌదర్‌పల్లి శివారులో వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు అప్పులు చేశారు. కుమార్తె వివాహం చేయాల్సి ఉండగా.. చేతిలో చిల్లి గవ్వ కూడా లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పొలం వద్దకు వెళ్తానని చెప్పి.. వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబం సభ్యులు వెళ్లి చూడగా, చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ.. మహిళ మృతి



మృతిచెందిన దివ్య

గుమ్మడిదల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు అదుపు తప్పి ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని మేడలమ్మ ఆలయ జరిగింది. గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని మేడలమ్మ ఆలయ సమీపంలో మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న మరొక కారును ఢీకొంది. దీంతో హైదరాబాద్ నుంచి వస్తున్న కారులో ప్రయాణిస్తున్న దివ్య(40) అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ తనయుడు నవీన్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన దివ్య తన భర్త అజయ్‌కుమార్, కుమార్తె మన్వితతో కలిసి మెదక్ చర్చి చూసేందుకు వస్తుండగా, ఈ ప్రమాదం జరిగింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం మండల కేంద్రంలో జరిగింది. అల్లాదుర్గం ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. రేగోడ్ మండలం ఆర్ ఇటిక్యాలకు చెందిన ఉప్పరి బాలరాజు (34), తన సోదరుడు నారాయణతో కలిసి అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో ఇంటి నిర్మాణం చేపట్టారు. శనివారం ఉదయం బాలరాజు భార్య తుల్జమ్మతో కలిసి ఇంటిపైకి సామగ్రి తరలిస్తుండగా, పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. పై నుంచి కింద పడి అపస్మారక స్థితికి వెళ్లగా, హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాలరాజు చనిపోయాడు. సోదరుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

'లైంగిక వేధింపులు అరికట్టే బాధ్యత అందరిది'

సంగారెడ్డి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపులు అరికట్టే బాధ్యత అందరిపై ఉన్నదని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన లైంగిక వేధింపులు నిరోధక చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పోష్ చట్టం 2013 పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చాడాలన్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపుపై హర్షం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి కార్మికులు, ఉద్యోగులు, ఆదాయపు పన్నుపై రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం మంచి నిర్ణయమని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు, కోటి మంది ఆరోగ్య భీమా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

క్రైస్తవులకు పాధాన్యత

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవులకు పెద్దపీట వేశారని పటాన్‌చెరు నియోజకవర్గ భారాస నాయకుడు ఆదర్శరెడ్డి అన్నారు. రామచంద్రాపురం పట్టణం లక్ష్మిగార్డెన్స్‌లో క్రిష్టియన్స్ అండ్ పాస్టర్‌ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాస్టర్ల సంఘంలో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయిన అధ్యక్షుడు ప్రశాంత్, వర్కింగ్ ప్రసిడెంట్ శంకర్, ప్రధాన కార్యదర్శి జోసఫ్‌లతో పాటు సభ్యులను సత్కరించారు.

'సిబ్బందిని నియమించాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని మావినెల్లిలో శనివారం భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 54 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

హామీల అమలులో విఫలం

జహీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుభరోసాను పూర్తిగా కుదించిందన్నారు.

పశువుల మార్కెట్‌ను తరలించాలని వినతి

జహీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణం నడిబొడ్డునగల పశువుల మార్కెట్‌ను తరలించి పట్టణం చివరలో విశాలంగా ఉన్న ప్రాంతంలోకి తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అందులో భాగంగా వారు శనివారం ఆర్డీవో రాంరెడ్డికి, వ్యవసాయమార్కెట్ కార్యాలయ అధికారులకు, జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు.

గోదావరి జలాల విడుదలపై హర్షం

వెల్దుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తిలోని రైతులకు సాగునీటిని అందించే హల్దీవాగులోకి గోదావరి జలాలు విడుదల చేయడం హర్షణీయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హల్దీవాగు పరీవాహక ప్రాంతంలో వేలాది మంది రైతులు వందల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారని, రైతులను దృష్టిలో పెట్టుకొని నీటి విడుదల చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

నర్సాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ వర్గానికి కూడా ఆశాజనకంగా లేదంటూ శనివారం సాయంత్రం నర్సాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మల్లేశం మాట్లాడుతూ దేశంలో 77 కోట్ల మంది రైతులు వ్యవసాయ రంగంలో ఉన్నా కనీస మద్దతు ధర హామీ పదేళ్లుగా అమలు చేయలేదన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపు పెంచలేదని ఆరోపించారు.

శ్రద్ధ వహిస్తే ఉన్నత శిఖరాలు

మునిపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చదువులపై శ్రద్ధ వహిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కొండాపూర్ సీఐ వెంకటేశ్ విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ కార్యాచరణపై బుదేరా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ రాజేష్‌నాయక్, కానిస్టేబుల్స్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

బడులకు నిధులొచ్చాయ్

- స్కూల్ గ్రాంటు, ఎంఆర్‌సీ, స్నాక్స్ నిధులు విడుదల
- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రారంభం



అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల నిర్వహణ భారం నెలల తరబడి ఎదురుచూపులకు తెరపడింది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన వంద శాతం నిధులు విడుదలయ్యాయి. గతంలో స్కూల్ గ్రాంటు, ఎంఆర్‌సీ గ్రాంటు, యూనిఫామ్ కుట్టుకూలీ నిధులు, కరాటే శిక్షణ నిధులు, పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు 50 శాతం నిధులు విడుదలైన విషయం తెలిసిందే. తాజాగా మరో 50 శాతం నిధులను విద్యాశాఖ విడుదల చేసింది. ఇందులో భాగంగా పాఠశాల నిర్వహణకు సంబంధించి రూ.2,42,17,500 నిధులు, ఎంఆర్‌సీ(ఎంఈవో ఆఫీసులు) నిర్వహణకు రూ.11,60,880 నిధులు, సేఫ్టీ అండ్ సెక్యూరిటీ కింద తొలి సారిగా పాఠశాలకు రూ.500 చొప్పున 1298 పాఠశాలలకు రూ.6,49,000 నిధులు, అదే విధంగా పదో తరగతి విద్యార్థుల కోసం అల్పాహారం కింద 7757 మంది విద్యార్థులకు రూ.15 చొప్పున 38 రోజులకుగాను రూ.44,21,490 నిధులు విడుదల చేసింది. ఆయా నిధులను ఆయా పాఠశాలల ఖాతాల్లో జమ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

●పాపన్నపేట: మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా శనివారం స్నాక్స్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఎంఈవో పుష్పవేణి మాట్లాడారు.

●అల్లాదుర్గం: అల్లాదుర్గం మండలంలో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం కార్యక్రమాన్ని ఎంఈవో ధనుంజయ్‌గౌడ్ శనివారం ప్రారంభించారు.

●నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంఈవో వెంకటేశం పర్యవేక్షించి, అల్పాహారం అందజేశారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

- ఈ ఆఫీస్- విధానం పకడ్బందీగా అమలు జరగాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుపరిపాలన అందించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ ఆఫీసు విధానం, అధికారుల సమయపాలన, ప్రత్యేకాధికారుల క్షేత్రస్థాయి పర్యటన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల ద్వారా వచ్చే ప్రతి ఫైల్ ఈ ఆఫీసు విధానంలోనే రావాలన్నారు. మాన్యువల్ ఫైల్స్ చూస్తామన్నారు. ఈ ఆఫీస్ విధానాన్ని ప్రకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యేకాధికారులు మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్

- బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి



వాకర్లతో ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హామీలే నెరవేర్చని బీఆర్ఎస్‌ను ప్రజలు ఫాంహౌజ్‌కు పరిమితం చేశారని.. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలను చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏడాది కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెనుక పార్క్, తారా కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్‌లో 9.. చౌటకూర్‌లో 6...

- ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్

పుల్‌కల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుల్కల్, చౌటకూర్ మండలాల్లో ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ) స్థానాలకు సంబంధించి ముసాయిదా జాబితా వెల్లడైంది. 2011 జనాభా లెక్కల ఆధారంగానే ఇప్పటివరకు ఉన్న ప్రాదేశిక నియోజకవర్గాల స్థానాలను ఖరారు చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువడనున్నదన్న సమాచారంతో అధికారులు ఆయా ఎంపీటీసీ స్థానాల పరిధిలోకి గ్రామపంచాయతీలను చేర్చుతూ ముసాయిదా జాబితాను విడుదల చేశారు. అయితే పుల్కల్ మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు, చౌటకూర్ మండలంలో 6 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

కలెక్టర్ హెచ్చరికలతో కదలిన అధికారులు

- వరద కాలువలో వేసిన పైపుల తొలగింపు



కాలువలోని పైపులను తొలగింపజేస్తున్న అధికారులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని వనం చెరువులోకి వరద నీరు తీసుకొస్తున్న కాలువల్లో కొందరు పైపులు వేస్తూ మట్టితో మూస్తున్నారు. ఈ విషయమై గతవారం స్థానికులు సంబంధిత అధికారులకు తెలపగా.. ఇరిగేషన్ ఏఈ సంతోషిణి కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయినా రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా పనులు కొనసాగిస్తున్నారని కలెక్టర్‌కు మరోమారు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈ సంతోషిణి, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ రామబ్రహ్మం దగ్గరుండి పైపులను తొలగింపజేశారు.

ఘనంగా మార్కండేయ జయంతి

నారాయణఖేడ్/నర్సాపూర్/మనోహరాబాద్/వెల్దుర్తి/పెద్ద శంకరంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో శనివారం మార్కండేయ జయంతిని పద్మశాలీసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నారాయణఖేడ్ శివారులోని మార్కండేయ భవన్‌లో ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ మాట్లాడారు. నర్సాపూర్‌లోని శివాలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్కండేయ చిత్రపటానికి నివాళులర్పించారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు పుట్ట మహేందర్ ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం నాయకుల ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని మార్కండేయ మందిరంలో పూజారి రాయల మహేష్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

ఎస్టీపీ నిర్మాణానికి రూ.60 కోట్లు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణానికి ఎంపీ ఎం.రఘునందన్‌రావు రూ.60 కోట్ల నిధులు సాధించారని బీజేపీ మాజీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. శనివారం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిధుల విడుదలకు సంబంధించిన లేఖను వారు విలేకరులకు చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లాపూర్‌లో ప్రధానంగా మురుగునీటి సమస్యతో చెరువులు కలుషితమవ్వడం, దుర్గంధంతో ప్రజలు అనారోగ్య బారినపడటం నిత్యకృత్యంగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో రఘునందన్‌రావు హామీఇచ్చారని గుర్తుచేశారు. అందులో భాగంగా రూ.60 కోట్లు సాధించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్‌యాదవ్, ప్రసన్న, రాజిరెడ్డి, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో 8 గొర్రెలు మృతిచెందాయి. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేటలోని శేరి అర్జున్‌కు చెందిన గొర్రెలపై వీధికుక్కలు దాడిచేడంతో శనివారం సాయంత్రం దాడి చేయడంలో 8 గొర్రెలు మృతిచెందగా.. 12 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. దాదాపు రూ.70 వేల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

వ్యవసాయ రంగంలో ఆధునికత

రామాయంపేట. ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో ఆధునికత సాకేతికత సంతరించుకోనున్నది. ఇక కూలీలతో పని లేకుండా డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా శిక్షణ పొందిన పైలట్ పంటలకు తెగులు, పురుగుల మందుల పిచికారీ చేస్తారు. ఈ మేరకు జిల్లాలోని ప్రథమంగా రామాయంపేట సొసైటీకి శనివారం ఇఫ్కో సంస్థ డ్రోన్, ఆటో ట్రాలీని అందజేసింది. ఇకమీదట పొలాల్లో దీనికి వాడకంతో కూలీల ఖర్చుతగ్గి లాభాలు అర్జించే వీలుందని ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, స్థానిక వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పేర్కొన్నారు.

నిజాయితీ చాటుకున్న గిరిజన మహిళ

- పోగొట్టుకున్న నగల బ్యాగు పోలీసులకు అప్పగింత

తూప్రాన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓ గిరిజన మహిళ నగల బ్యాగు అప్పగించి నిజాయితీ చాటుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బాలాజీనగర్‌కు చెందిన గరుగుల శిరీష తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లిలో తల్లిగారింట జరిగే ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు శుక్రవారం ఇంటి నుంచి ఆటోరిక్షాలో వచ్చింది. నర్సాపూర్ చౌరస్తాలో దిగి తల్లిగారింటికి వెళ్లేందుకు సోదరుడు రాజుకు ఫోన్‌చేసింది. వెంట తెచ్చుకున్న మూడు బ్యాగులు నర్సాపూర్ చౌరస్తా వద్ద పెట్టి సోదరుడి కోసం వేచి ఉంది. సోదరుడు రావడంతో అక్కడ పెట్టిన రెండు బ్యాగుల్లో రెండు తీసుకుని, 8 తులాల బంగారు, 5 తులాల వెండి అభరణాలు ఉన్న బ్యాగు అక్కడే వదిలి వెళ్లిపోయింది. తూప్రాన్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసే శివ్వంపేట మండలానికి చెందిన గిరిజన మహిళా సక్కుబాయి బ్యాగును గుర్తించి వెంట తీసుకెళ్లింది. అయితే ఇంకో బ్యాగు లేకపోవడంతో శిరీష శనివారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నగల బ్యాగు కోసం వెతుకుతుండగానే, నగల బ్యాగును తీసుకెళ్లిన సక్కుబాయి బ్యాగులో ఏమున్నాయో చూడకుండానే పోలీసులకు అప్పగించింది. 8 తులాల బంగారు నగల బ్యాగును నిజాయితీగా అప్పగించిన సుక్కుబాయిని పలువురు అభినందించారు.

శ్రీవైకుంఠపురంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



సంగారెడ్డి శివారులోని శ్రీ వైకుంఠపురంలో బ్రహోత్సవాల్లో అహోబిల రామానుజజీయర్‌స్వామి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీ వైకుంఠపురం ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ధ్వజారోహణం, పెద్ద శేషవాహన సేవ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అహోబిల రామానుజజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం నుంచే ఆలయంలో పూజలు, హోమం నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన హనుమాన్ ఆలయం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండల పరిధిలోని చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వయంభూవుగా వెలసిన హనుమంతుడిని దర్శించుకోవడానికి ఖేడ్ ప్రాంతంవారే కాకుండా సరిహద్దు జిల్లాల భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆశీస్సులు పొందారు.

శివపంచాయతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన

వట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండలం మేడికుంద గ్రామంలోని శివాలయంలో నిర్వహిస్తున్న శివ పంచాయతన నవగ్రహ ధ్వజ ప్రతిష్ఠాపన శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు

బాలాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

తూప్రాన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో వెలసిన పురాతన శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో 30వ పునశ్చరణ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, దేవీ ఉపాసతకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఆలయంలో శ్రీబాలాంజనేయస్వామికి విశేష అభిషేకం, పూజలు, పరివార దేవతలకు విశేష అర్చనలు నిర్వహించారు.

పానాది దారి కబ్జా చేశారంటూ గ్రామస్థుల నిరసన

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్టాపూర్ గ్రామం నుంచి కేశ్వార్ గ్రామానికి వెళ్లే పానాది నడకదారిని స్థానిక ఓ ఫాంల్యాండ్ యజమానులు కబ్జా చేశారంటూ గ్రామస్థులు ఫాంల్యాండ్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే జరిపి పానాది దారిని కబ్జాచేసిన యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నతనంలోనే క్రీడాకారులుగా రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సింధూ

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చదువుకుంటున్న సమయంలో క్రీడాకారులుగా రాణించాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి అన్నారు. శనివారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎంఐజీ కాలనీ వాణి విద్యానికేతన్ పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని దీప ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. చదువుతున్నప్పుడు క్రీడల పట్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, మోహన్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరావు, ఉపాధ్యక్షుడు నారాయణగౌడ్, కార్యదర్శి సుబ్బారావు, డైరెక్టర్లు నీలకంఠం, రాములు తదితరులు పాల్గొన్నారు.

బస్తీదర్శన్‌తో సమస్యల గుర్తింపు: కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమ్యలపై ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయనున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్ అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో అధికారులతో కలిసి బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనాభా పెరగడం వల్ల మురుగు పైపులైన్ సామర్థ్యం సరిపోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. నిత్యం లీకేజీలు పెరుగుతున్నాయని బస్తీవాసులు అధికారులకు వివరించారు. సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు దివ్య, జ్యోతినాయక్, నాయకులు సామ్యూల్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

వెల్దుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, టీచర్ ఎమ్మెల్సీ ఓటు హక్కు కొరకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. ఈ విషయమై శనివారం రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా ఎస్టీయూ డైరీని మంత్రి ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డైరెక్టరీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డిలను ఎస్టీయూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంకినేని మధుసూదన్‌రావుతో కలిసి డైరీని అందజేసినట్లు వారు తెలిపారు.

ఆరు రోజులపాటు రైల్వే గేటు మూసివేత



మూసివేయనున్న కోహీర్ సమీపంలోని 22వ నంబరు రైల్వే గేట్

జహీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కోహీర్-నాగిరెడ్డిపల్లి మార్గమధ్యలో గల కోహీర్ సమీపంలోని 22వ నంబరు రైల్వే గేటును అత్యవసర పనుల నిమిత్తం ఆరు రోజులపాటు మూసివేస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైల్వే గేటు వద్ద మరమ్మతు పనుల నిమిత్తం ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 8వ తేదీ సాయత్రం 6 గంటల వరకు రైల్వే గేటును మూసివేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని వెళ్లాలని కోరారు.

'బలమైన తిండి తింటేనే ఆరోగ్యం'

జహీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారం బాగుంటేనే ఆరోగ్యంగా ఉంటామని డీఎస్-కేవీకే శాస్త్రవేత్త శ్రీకాంత్, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతరను నిర్వహించారు. అందులో భాగంగా డీడీఎస్ మహిళా రైతులు, గ్రామస్థులు కలిసి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, డీడీఎస్ మహిళా రైతులు, మంజుల, నర్సమ్మ, నర్సింలు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం: ఎంఈవో

నర్సాపూర్/అల్లాదుర్గం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కిరణ్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యువకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేడు పంచమ వైదిక మహాయజ్ఞం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి గణేష్‌నగర్‌లోని వైదిక ధ్యాన యోగా క్షేత్రంలో 2వ తేదీన పంచమ వైదిక మహాయజ్ఞాన్ని ఉదయం 7.30 నుంచి 12.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. శ్రీధరానంద భారతీ స్వామి, వేదపునీత భారతీస్వామి హాజరుకానున్నారు.

చెరువులో గల్లంతు.. 40 గంటల తర్వాత ఆచూకీ



రాకేష్(ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి చెరువులో పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది చెరువులో గాలించగా, 40 గంటల అనంతరం మృతదేహం లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన రాజేష్(32) భార్య కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో రాజేష్ మనస్థాపానికి గురై గత గురువారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందించగా, శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అతని మృతదేహం లభించింది. దానిని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

మెదక్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి బొడ్మాట్‌పల్లి శివారులోని 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామానికి చెందిన సరేందర(34) జోగిపేటకు వెళ్లి వస్తున్నాడు. టేక్మాల్ మండల పరిధిలోని బిబి తండాకు చెందిన గణపతినాయక్ ఎక్సెల్‌పై పని నిమిత్తం జోగిపేట వెళ్తున్నాడు. బొడ్మాట్‌పల్లి శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో సురేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. గణపతికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేందర్ మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఏఎస్ఐ దయానంద్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదన్నారు.

కడుపునొప్పి మందు అనుకొని... పురుగుల మందు తాగి వృద్ధురాలి మృతి



పోచమ్మ(ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి మందు అనుకొని పురుగుల మందు తాగి శనివారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. అల్లాదుర్గం ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం. మండలంలోని అప్పాజీపల్లికి చెందిన గుబ్బలు పోచమ్మ(75) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించినా నొప్పి తగ్గలేదు. శనివారం ఉదయం పోచమ్మకు మరోమారు తీవ్ర కడుపునొప్పి రావడంతో కడుపునొప్పి మందు అనుకొని ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. దీంతో ఆమెను జోగిపేట ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చనిపోయింది. కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.